ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 20 జూలై 2025



● గోరింటాకు సంబరాలు...



సుల్తానాబాద్ శ్రీవాణి కళాశాలలో గోరింటాకు వేడుక

● పాఠశాలల్లో సందడి
● ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం గోరింటాకు సంబరాలు, బోనాలు వేడుకలు నిర్వహించారు. బోనాలతో పోచమ్మ ఆలయాలకు వెళ్ళి నైవేద్యం సమర్పించారు. శివసత్తులు, పోతరాజు వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఆషాఢమాసంలో బోనాలు, గోరింటాకు పెట్టుకునే సంప్రదాయంపై ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

● బోనాల వేడుకలు



ఎన్టీపీసీ విశ్వభారతి పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు

పెద్దపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నాహక కార్యశాల నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలో చర్చించడమే ప్రధాన ఎజెండాగా కార్యశాల నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సీట్లను కైవసం చేసుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలు, హామీలు అమలు చేయక పోవడంపై ఇంటింటి ప్రచారం చేయాలని పార్టీ నేతలకు సూచించారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారా తెలంగాణ గ్రామాభివృద్ధి సాకారమైందని ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, పెద్దపల్లి మాజీ ఎంపీ, జిల్లా ఎన్నికల ప్రభారీ వెంకటేశ్ నేత, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ సునీల్‌రెడ్డి, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పర్వతాలు సురేష్ రెడ్డి నారాయణరెడ్డి, కందుల సంధ్యారాణి, సోమవారం లావణ్య, పాల్గొన్నారు

లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రామగుండం ఏరియా లారీ యజమానులు, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం గంగానగర్‌లోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. లారీ డ్రైవర్లకు, యజమానులకు నుంచి సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులతో చర్చించి లారీలకు యూరియా రవాణా ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. హెచ్‌కేఆర్ యాజమాన్యంతో మాట్లాడి టోల్‌ఫీజు తగ్గించినందుకు లారీ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫా, లారీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. 7వ డివిజన్ అధ్యక్షుడు ఎండీ నజీమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, డివిజన్లలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తూ రామగుండాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

న్యూస్ బాక్స్

గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్

పెద్దపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీల సమగ్రాభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ రియాజ్ అహ్మద్‌తో కలసి శనివారం మంత్రికి నివేదికను అందించామని చెప్పారు. ఈ సందర్భంగా అన్నయ్య గౌడ్ మాట్లాడుతు జిల్లాలోని శాఖ గ్రంథాలయాలలో కూడా తగిన సిబ్బంది లేరని, జిల్లా కేంద్రంలో కూడా అదే పరిస్థితి ఉందని వెంటనే 25 మంది సిబ్బందిని నియమించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 750 పోస్టుల భర్తీ అవసరముందన్నారు. జిల్లాలోని అనేక గ్రంథాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, మరి కొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయని సొంత భవనాల మరమ్మతులు, అభివృద్ధికి రూ 25 కోట్లు కేటాయించాలన్నారు.

● ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ కరువు
● కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించినా మారని తీరు
● రెగ్యులర్ ఏడీ ఉన్నా, డీఈవోగా కరీంనగర్ ఏడీ కొనసాగింపు





పాఠ్యాంశాలు వివరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష(ఫైల్)

అస్తవ్యస్తంగా జిల్లా విద్యాశాఖ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లా విద్యా శాఖ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడడంతో విద్యా ర్థులు, వారి తల్లితండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుదీర్ఘ కాలంగా డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి పని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షిం చక పోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘించినా వాటిపై చర్యలకు ఉపక్రమించడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 559 ఉండగా, ప్రైవేట్ పాఠశాలలు 166 వరకు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఏడాది కాలంలో సందర్శించిన పాఠశాలల్లో, 45 నెలలుగా ఇక్కడ పని చేస్తున్న డీఈవో సగం పాఠశాలలను కూడా సంద ర్శించ లేదనే అపవాదు ఉంది. కలెక్టర్ ఒక మండలానికి వెళితే అందులో కనీసం ఐదారు పాఠశాలలను సందర్శి స్తుంటారు. పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి సారించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేయిం చారు. కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాల యాల్లో వేడి నీటి సౌకర్యం కల్పించారు. విద్యార్థులతో మాట్లాడి వారు బోధనా పరంగా, మౌలిక వసతుల పరంగా పడుతున్న ఇబ్బందులు తెలుసుకుంటున్నారు. రెగ్యులర్‌గా పర్యవేక్షించాల్సిన డీఈవో పాఠశాలలను సందర్శించడం లేదనే విమర్శలున్నాయి.

జిల్లాలో 166 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఇందులో 47 వేల మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తు న్నారు. జీఓ నంబర్ 1 ప్రకారం పాఠశాలలు ఉండాలి. సగం పాఠశాలల్లో మాత్రమే ఆ మేరకు వసతులు న్నాయి. కొన్నింటిలో క్రీడా మైదానాలు లేకపోవడంతో పాటు ఇరుకు గదులున్నాయి. పాఠశాలల ఆరంభ సమయంలో ప్రార్థన చేసేందుకు కూడా స్థలం లేదు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, టై, బెల్టులు, యూని ఫామ్‌లు, స్టడీ మెటీరియల్ మొత్తం ప్రైవేట్ పాఠశాలల యజమానులే విక్రయి స్తున్నారు. బయటకంటే అడ్డగోలు ధరలకు అంటగట్టి అదనంగా లాభ పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా కూడా, వీరి వ్యవహారంపై విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విద్యాశాఖాధికారులు పట్టించుకోవ డం లేదు. వాళ్లు నిర్వహిస్తే వార్షికోత్సవ, ఇతర కార్యక్ర మాలకు హాజరయ్యేందుకు ప్రాధాన్యమిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలకు సమయం కేటాయించడం లేదనే విమర్శలున్నాయి.

● కలెక్టర్ సమావేశం పెట్టినా కూడా..

జిల్లా విద్యా శాఖ పని తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శల నేపథ్యంలో కలెక్టర్ విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం పెట్టినా వారి పని తీరు మారడం లేదు. కలెక్టర్ కోయ శ్రీహర్ష గత నెల 20వ తేదీన జిల్లా విద్యా శాఖలో పని చేసే అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయ

(మిగతా 8వపేజీలో)

సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న ప్రతీ లబ్ధిదారునికి సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం పాలితం, కాసులపల్లి, గోపయ్యపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లకు ముగ్గులు పోసి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని, రైతులకు రుణమాఫీ చేయలేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తరుగు పేరిట దోపిడి చేశారే తప్ప అభివృద్ధి జరిగిన దాఖలాలు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని జమ చేసిందని గుర్తు చేశారు. నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, మరో మూడు విడతలుగా ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. గతంలో ఇసుక, మట్టి అమ్ముకున్న పాలకులు ఉన్నారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చౌకగా ఇసుకను అందిస్తుం దన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కూర మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, ఇనుగాల రాజిరెడ్డి, సాయిచంద్‌రావు, ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యనందించాలి



హెచ్‌ఎంలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందేలా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పలు పాఠశాలల హెడ్ మాస్టర్లు, అధికారులతో విద్యా ప్రమాణాల పెంపుపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో పాఠశాలల్లో చదివే 9, 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం చదివి అర్థం చేసుకోవడం 53 శాతం మాత్రమే ఉంటున్నారని, భాష అర్థం చేసుకోకపోతే గణితం, సైన్స్ వంటి పాఠ్యాంశాలు అర్థం చేసుకోలేరని తెలిపారు. దీనిపై హెడ్ మాస్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు భాషపై కనీస పరిజ్ఞానం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 40 శాతం మంది విద్యార్థులు మెరుగ్గా ఉంటే జిల్లాలో తక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యార్థుల విద్యా స్థాయి పెంచడంలో ఉపాధ్యాయులు చర్యలు చేపట్టకపోతే వారు సెలవులపై వెళ్లవచ్చని అన్నారు. సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో కూడా విద్యార్థులు 30 శాతం మాత్రమే మెరుగ్గా ఉన్నారని, ఇది చాలా ఆందోళనకరమని ఆయన అన్నారు. 9వ తరగతిలో 31 శాతం మంది విద్యార్థులు మాత్రమే బేసిక్ మ్యాథ్స్ చేస్తున్నారని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ సంబంధించి ఉన్న పెండింగ్ ఇబ్బందులు వారం రోజుల్లో సెట్ చేసుకోవాలని, వంద శాతం ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు నమోదు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులతోపాటు 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో ప్రతి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి నెల 25న పాఠశాలలను ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రగతి సిలబస్‌పై సమీక్షించాలన్నారు. జిల్లా విద్యాధికారి మాధవి, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..

మాడిపోతున్న నారుమడులు..

● నారు కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు
● ఖరీఫ్ సాగుపై సన్నగిల్లుతున్న ఆశలు
● ఎస్ఆర్ఎస్పీ నీటితో చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్

మంథని, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరుణుడి కరుణ లేక.. అన్నదాతలు వరి సాగు పై ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురియక పోవడంతో మంథని ప్రాంతంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాభానికి తోడు ఎండలు సైతం మండుతుండంతో డివిజన్‌లోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని పలు మెట్ట ప్రాంత గ్రామాల్లో, మంథని పట్టణ శివారులో నారు మడులు మాడిపోతున్నాయి. వారం, పది రోజు క్రితం రైతులు వరి విత్తనాలు అలుకుకోగా వర్షం పడకపోవడం ఎండ వేడి పెరగడంతో వాటికి నీరు అందక ఎండిపోతున్నాయి. వర్షాలు కురవపోవడంతో నారుమడులు అలి కిన భూములు సైతం నెర్రలుబారి దర్శమిస్తున్నాయి. భూగర్భ జలాలు సైతం సరిగా లేక బోర్ల నుంచి సైతం నీరు సరిగా రావడం లేదు. నీరు అందక, కరెంటు సరిగా లేక మోటార్లు సైతం కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటార్ల రిపేర్ల కోసం వేలాది రూపా యలు ఖర్చు చేయాల్సి వస్తుం దని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఎండిపోతున్న నారుమ డులను కాపాడుకోవడానికి కొం దరు రైతులు వాటర్ ట్యాంకర్ల ద్వారా, మరికొం దరు మోటార్ల ద్వారా నీరందిస్తు న్నారు. డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండ లాల్లోని చెరువులు, కుంటలను ఎస్ఆర్ఎస్పీ నీటితో నింపాలని రైతులు కోరుతు న్నారు. కెనాల్ ద్వారా సాగు నీటిని విడతల వారిగా సరఫరా చేసి పంటలు కాపాడాలని వేడుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ కావ డంతో భూముల సాగు సన్నాహలు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుపై ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెట్టారు. చాలా మంది రైతులు వీటి కోసం అప్పులు సైతం చేశారు. వాతారణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా సకాలంలో వర్షాలు కురియక ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగుపై రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ, నీటి పారుదల, ఎస్ఆర్ఎస్పీ శాఖల అధికారులు స్పందించి నారుమడులు ఎండిపోకుండా ఉండటానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎండిపోయిన నారుమడులు, నెర్రలుబాసిన నేల



ఎండిపోయిన నారుమడిని చూపిస్తున్న రైతులు



నారుమడిని కాపాడుకునేందుకు నీళ్లు చల్లుతున్న రైతు

● వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రోహిణి కార్తె ప్రారంభంలోనే రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ బావుల వద్ద రైతులు వరి నార్లు పోసి, ప్రస్తుతం నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని 12 గ్రామాల పరిధిలో నీటి లభ్యతను బట్టి 90 శాతం మంది రైతులు వరి సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. శ్రీరాంసాగర్ ఆయకట్టు డీ86 ప్రధాన కాలువకు దిగువన ఉండటంతో ఎస్సారెస్పీ సాగునీరు ఇక్కడి భూములకు సమృద్ధిగా లభిస్తోంది. ఈ ఖరీఫ్‌లో 14,350 ఎకరాల్లో పంట సాగు అంచనా. గ్రామాల్లో ఉన్న నీటిని ఆధారం చేసుకుని వరి నాట్లు వేస్తున్నా ఆశిం చిన మేర వర్షాలు పడక పోవడంతో అన్నదాతల్లో ఆందోళనలు నెలకొన్నాయి. వ్యవసాయ కూలీల కొరత అధిగమించేందుకు మహారాష్ట్ర, బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వలస కూలీలు గ్రామాలకు చేరుకున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి.....
- ఉమాపతి, మండల వ్యవసాయ అధికారి

ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల సంరక్షణపై రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి. తద్వారా ఆశించిన పంట దిగుబడి, పెట్టుబడి వృధాకు ఆస్కారం ఉండదు.



60 వసంతాల ఎస్కేఎన్ఆర్ కళాశాల

- రేకుల షెడ్డులో ప్రారంభమై..
  జగిత్యాలకు తలమానికంగా నిలిచి
- ఎందరో మహానుభావులను తీర్చిదిద్దిన ఘనత
- వజ్రోత్సవాలకు సిద్ధం

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆ కళాశాలకు 60 సంవత్సరాలు నిండాయి. ఓ రేకుల షెడ్డులో ప్రారంభమైన ఆ కళాశాల మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులను అక్కున చేర్చుకొని ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. ఎందరో విద్యార్థులను డాకర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టులను, ప్రజాప్రతినిధులను తీర్చిదిద్దింది. అదే జగిత్యాలలో శ్రీ కాసుగంటి నారాయణ రావు గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల. జగిత్యాలకు చెందిన కాసుగంటి నారాయణరావు జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లో 32.07 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళంగా ఇచ్చాడు. ఆ స్థలంలో 1965 ఆగస్టు 12వ తేదీన ప్రారంభమైన ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా ఎదిగింది.


కళాశాలలో తొలి బ్యాచ్ విద్యార్థులు

డిగ్రీ చదువుతున్నావా.. ఎక్కడ అంటే.. జగిత్యాల ఎస్కేఎన్ఆర్ కాలేజీలో.. పదేళ్ల క్రితం వరకు జగిత్యాల నుంచి మొదలుకుని ప్రస్తుత మంచిర్యాల జిల్లా గోదావరి తీర ప్రాంత గ్రామాల విద్యార్థులను ఎవరిని అడిగినా ఇదే సమాధానం వచ్చేది. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలు ఏర్పడడంతో కొంత క్రేజీ తగ్గినా ఎస్కేఎన్ఆర్ కళాశాల అంటే ఓ బ్రాండ్.. ఇక్కడ చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా ఉండడం విశేషం.. ఓ రేకుల షెడ్డులో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

● పీవీ నరసింహారావు చొరవతో..

1965 సంవత్సరంలో జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రేకుల గదులలో డిగ్రీ కళాశాల ప్రారంభమైంది. ఆ సమయంలో కళాశాలకు గుర్తింపు కోసం ఉస్మానియా విశ్వ విద్యాలయం పలువురు ప్రముఖులతో ఒక కమిషన్‌ను నియమించి పరిశీలనకు పంపించింది. కమిషన్ సభ్యుల్లో పీవీ నరసింహారావు ఉన్నారు. కళాశాల ఆవరణను పరిశీలించిన బృందం సభ్యులు నిబంధనల ప్రకారం వసతులు లేవనే నిర్ణయానికి వచ్చారు. పీవీ నరసింహారావు జోక్యం చేసుకొని ఇతర ప్రాంతాల్లో సైతం ఇలాంటి వసతులతోనే కళాశాలలు ప్రారంభించామని, తర్వాత అన్ని వసతులు సమకూరాయని చెప్పడంతో ఇతర సభ్యులు ఒప్పుకున్నారు. దీంతో పీవీ నరసింహారావు చొరవతో యూనివర్సిటీ నుంచి కళాశాలకు గుర్తింపు వచ్చినట్లు పూర్వ విద్యార్థులు అంటున్నారు.

● ఉత్సవాలకు సన్నాహాలు..

జగిత్యాల ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల వజ్రోత్సవాలను నిర్వహించడానికి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కళాశాలను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణలు సందర్శించి వజ్రోత్సవాల నిర్వహణపై సూత్రప్రాయంగా చర్చించారు. హైద్రాబాద్‌లో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి వజ్రోత్సవాల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని భావిస్తున్నారు.

● ఉన్నత స్థానంలో వేల మంది విద్యార్థులు..

జగిత్యాల ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల అరవై సంవత్సరాలుగా వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. సువిశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ, పీజీ విద్యకు సంబంధించిన పలు కోర్సులున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీసీఏ, పోస్టు గ్రాడ్యుయేట్‌లో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ తెలుగు కోర్సులున్నాయి.

ఇంజనీరింగ్, పాలిసెట్ హెల్ప్‌లైన్ ఉన్నాయి. నిరుద్యోగుల కోసం బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాలు, మంచిర్యాల జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 605 మంది విద్యార్థులున్నారు. 26 మంది బోధనా సిబ్బంది, 30 మంది బోధనేతర సిబ్బంది విద్యార్థులకు సేవలు అందిస్తు న్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, డిజిటల్ లైబ్రరీ వంటి వసతులున్నాయి. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ తదితర వసతులను సమకూర్చారు. కళాశాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీ దేవీ విగ్రహం విద్యార్థుల్లో భక్తిబావం నింపుతోంది.


కళాశాలకు భూమిని విరాళంగా ఇచ్చిన కాసుగంటి నారాయణరావు

● మహామహులకు నీడనిచ్చిన కల్పతరువు

కళాశాలలో వివిధ బ్యాచ్‌లో విద్యను అభ్యసించిన పలువురు విద్యార్థులు ప్రస్తుతం సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రులు గొడిసెల రాజేశంగౌడ్, సుద్దాల దేవయ్య ఈ కళాశాల విద్యార్థులే. హైకోర్టు జస్టిస్ పుల్ల కార్తిక్, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య కడారు వీరారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య భూమయ్యతో పాటు జయ ప్రకాశ్, హనుమాండ్ల భూమయ్య, మంగారి రాజేందర్, లక్ష్మణరావు, డాక్టర్ బి నరేందర్ రావు వంటి వారు విద్యారంగంలో సేవలు అందిస్తున్నారు. కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి అరిగెల అశోక్ ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

జగిత్యాలకు తలమానికం


- డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే, కళాశాల పూర్వ విద్యార్థి

జగిత్యాల జిల్లాకు తలమానికంగా ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల నిలుస్తోంది. కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు వివిధ రంగాల్లో మంచి మంచి హోదాల్లో స్థిరపడ్డారు. సమాజానికి పలువురు డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలను అందించిన కళాశాల వజ్రోత్సవాలకు సిద్ధమవుతుండడం సంతోషకరం.

పేరు ప్రఖ్యాతులు గాంచిన కళాశాల ఎస్కేఎన్ఆర్


- ఎల్ రమణ, ఎమ్మెల్సీ, కళాశాల పూర్వ విద్యార్థి, జగిత్యాల

జగిత్యాల ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచింది. కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకున్నారు. వజ్రోత్సవానికి సిద్దమవుతున్న సందర్భంగా పాత జ్ఞాపకాలు మదిలో మెదులుతున్నాయి.

వజ్రోత్సవ వేళ.. ప్రిన్సిపాల్‌గా.. పూర్వ విద్యార్థిగా..


- డాక్టర్ అరిగెల అశోక్, కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థి, జగిత్యాల

జగిత్యాల ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల వజ్రోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా ఎన్నో అనుభవాలు గుర్తుకొస్తున్నాయి. కళాశాలలో చదివి ప్రస్తుతం ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తుండడం సంతోషాన్ని అందిస్తోంది. వజ్రోత్సవాల సమయంలో ఒక వైపు ప్రిన్సిపాల్‌గా, మరో వైపు పూర్వ విద్యార్థిగా సేవలు అందించనుండడం అదృష్టంగా భావిస్తున్నాను.

గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి

- ఆరుగంటల అనంతరం తెలిసిన ఆచూకీ
- తల్లిదండ్రులకు అప్పగింత

ధర్మారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలోని మేడారం తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల-కళాశాల నుంచి శనివారం ఉదయం విద్యార్థి గోడదూకి పారిపోయిన సంఘటన కలకలం రేపింది. ఆరు గంటల అనంతరం విద్యార్థి ఆచూకీ లభించడంతో కథసుఖాంతమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాధర్మపురికి చెందిన ఇమ్మడి మెగావర్షిత్ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం 4గంటల ప్రాంతంలో విద్యార్థులు స్నానాలు చేసేందుకు వాచ్‌మన్ మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లాడు. ఈ సమయాన్ని అదునుగా భావించిన మెగావర్షిత్ గేట్‌పక్కన గోడదూకి పారిపోయాడు. 5గంటలకు విద్యార్థుల అటెండెన్స్ తీసుకుంటున్న క్రమంలో విద్యార్థి లేడనే విషయం ఉపాధ్యాయులకు తెలిసింది. విద్యార్థి పాఠశాల నుంచి పారిపోయాడనే విషయం తెలియడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థి కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థి ఆచూకీ కోసం ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌తోపాటు ఉపాధ్యాయులు ధర్మారం, పెద్దపల్లి, ధర్మపురి ప్రాంతాలలో వెతికారు. విద్యార్థి మిస్సింగ్ విషయం ప్రిన్సిపాల్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పాఠశాలలోని సీసీ కెమారాలు పరిశీలించారు. ఉదయం 4.20 ప్రాంతంలో మెగావర్షిత్ పాఠశాల నుంచి బ్యాగ్ వేసుకొని వెళుతున్న దృశ్యాలు సీసీ కెమరాలో రికార్డ్ అయ్యాయి. మేడారంలోని ఓ పెట్రోల్‌బంకు సమీపంలోని మామిడి తోటలోఉన్నాడు. వెంట తెచ్చుకున్న ఖర్జూర పండ్లతోపాటు బిస్కట్స్, చాక్లెట్స్, బ్రెడ్ తిని నీరు తాగేందుకు తోట నుంచి బయటకు వచ్చాడు. బోనాల సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్తున్న అదే పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు మెగా వర్షిత్‌ను గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు వెళ్లి విద్యార్థిని పాఠశాలకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎందుకు పారిపోయావని విద్యార్థిని అడగగా కుటుంబ సభ్యులను చూడాలని పించిదని, రెండు రోజులు ఇంట్లో ఉండి వద్దామనుకున్నానని మెగా వర్షిత్ తెలిపాడు.

అనారోగ్యంతో వివాహిత బలవన్మరణం


జ్యోతి(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లె గ్రామానికి చెందిన కడారి జ్యోతి(40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నెల రోజులుగా జ్యోతి కడుపునొప్పితో బాధపడుతుండగా ఆపరేషన్ చేయించారు. తిరిగి కడుపు నొప్పి వస్తుండడంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

ఉరి వేసుకుని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని తులసీనగర్‌లో అనారోగ్య కారణంతో శనివారం ఓ ట్రాన్స్‌జెండర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడకు చెందిన తిరుమందాసు మనీంద్ర అలియాస్ అన్విక(25) అనేట్రాన్స్‌జెండర్ కొంత కాలంగా జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌లో నివసిస్తున్నాడు. అనారోగ్య కారణంతో తీవ్రమనస్థాపానికి గురై తన ఇంట్లో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన కుడిక్యాల సిద్ధిరాములు(73)అనే వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్ధిరామయ్యకు వృద్ధాప్యం కారణంగా తరచూ అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. చికిత్స చేయిస్తున్నా తిరిగి వస్తుండడంతో మనస్థాపం చెంది శనివారం తెల్లవారుజామున ఇంటి ముందు రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పదినెలల క్రితం మృతిచెందింది. ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

శంకరపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో శనివారం ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన మూల రాకేష్(28) ఇంటి గోడను ఆనుకొని నిలుచున్నాడు. ఇంటిరేకుల షెడ్డుపై సర్వీస్ వైర్ ఉండడంతో కరెంట్ గోడకు ప్రవహించి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి రాకేష్ భార్య మూల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల-పూడూర్ రైల్వే స్టేషన్ల మధ్య 60 ఏళ్ల లోపు గల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భార్యపై భర్త హత్యాయత్నం

కోల్‌సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఎల్‌బీనగర్‌లో నివాసముండే జటోత శాంతి(37) అనేమహిళపై శనివారం ఆమె భర్త సర్వేష్ హత్యాయత్నంకు పాల్పడినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సర్వేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే విషయంపై భార్య భర్తల మధ్య గొడవ జరిగిందని, దీంతో సర్వేష్ భార్యను హత్య చేయాలని ఆమె తలనుబలంగా గోడకు కొట్టడంతో గాయాలయ్యాయన్నారు. ఆమెను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శాంతి ఫిర్యాదు మేరకు సర్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ గ్రామశివారులోని మామిడితోటలో పేకాటఆడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి శనివారం తెలిపారు. మామిడితోటలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడిచేసినట్లు ఎస్ఐ వివరించారు. వారివద్ద రూ.6,500 నగదు, 8ద్విచక్రవాహనాలు, 9సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎస్పీ మహేష్‌కు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన సీపీ గౌస్ ఆలం, పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో శుక్రవారం మరణించిన డీఎస్పీ మహేష్ అంత్యక్రియలు శనివారం పోలీసు లాంచనాల ప్రకారం కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ శ్మశానవాటికలో జరిగాయి. ఈ అంత్యక్రియల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం పాల్గొని, డీఎస్పీ మహేష్ పార్థివదేహంపై పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. దహనసంస్కారంకు ముందుగా సంతాపసూచకంగా పోలీసులు మూడు రౌండ్ల గాలిలోకి కాల్పులు జరిపారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, అడిషనల్ డీసీపీ ఏఆర్ భీం రావుతోపాటు కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది డీఎస్పీ మహేష్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డీఎస్పీమహేష్ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.


సంతాపసూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

చిగురుమామిడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. వర్షాకాలం సీజన్‌లో వరినాట్లు వేసే సమయం కావడంతో రైతులకు నిత్యం కరెంటు అవసరం ఉంటుంది. తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే చాలా సమయం పడుతుంది. వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదేవిధంగా దొంగతనాలు జరిగిన సందర్భాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రాత్రిళ్లు వ్యవసాయబావుల వద్దకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. పోలీసులుగ్రామాల్లో గస్తీ తిరిగి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళల రక్షణకే షీ టీం

పెద్దపల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం షీటీం పని చేస్తుందని షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. శనివారం పెద్దకల్వల నోబెల్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్నేహలత మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలతో పాటు జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కళాశాలల వద్ద షీటీం నిరంతరంగా నిఘా పెడుతుం దని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్‌చేసి సమా చారం అందించాలన్నారు. కరస్పాండెంట్ మోహన్‌రాజ్, ప్రధానోపాధ్యాయులు ప్రణీత, షీ టీం సభ్యులు మౌనిక, సురేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యురాలు స్నేహలత

బైక్ చోరీ

గంభీరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లమద్ది గ్రామంలో వేముల శ్రీదర్‌కు చెందిన బైక్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. శ్రీదర్ తనఇంటి ముందు శుక్రవారం రాత్రి పెట్టిన బైక్(టీజీ23 6155) మరుసటిరోజు ఉదయం లేచి చూసే సరికి లేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో శ్రీదర్ ఫిర్యా దు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థికి గాయాలు

గంభీరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలుర ఎస్సీ హాస్టల్‌లో శనివారం పైకప్పు పెచ్చులు ఊడి ఓవిద్యార్థికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికిచెందిన మండాటి సన్విత్ అనే 8వ తరగతి విద్యార్థిహాస్టల్‌లో స్నానం చేస్తుండగా పైకప్పు పెచ్చులు ఊడి తలపై పడ్డాయి. విద్యార్థి తలకుగాయాలు కావడంతో బంధువులువచ్చి, ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల వెనుకభాగంలో రక్తస్రావం కావడంతో వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఈవిషయమై ఇన్‌చార్జి వార్డెన్ బూదమ్మను అడగగా హాస్టల్ భవనం పాతది కావడంతో పైకప్పు పెచ్చులు ఊడి ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

- క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో సైబర్ మోసాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి గితే


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల క్రైం జూలై 19 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ చింతల్ ప్రాంతానికిచెందిన మహమ్మద్ ఖలీం పాషా, రషీద్ అనేఇద్దరు చెడువ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బులు సంపాదించాలని, కలకత్తాలో తమకు పరిచయం ఉన్న అంకిత్ అనేవ్యక్తి దగ్గర ఆన్లైన్ మోసాలు ఎలా చేయాలో నేర్చుకున్నారు. అంకిత్ ఆర్బీఎల్ క్రెడిట్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారివివరాలు ఖలీం, రషీద్‌లకు పంపగా, వారు కస్టమర్‌కేర్ నుంచి మాట్లాడినట్లు నమ్మించి బాధితులకు ఏపీకే లింక్ పంపేవారు. వారు పంపిన ఏపీకే లింకును బాధితులు క్లిక్ చేసిన ఇన్‌స్టాల్ చయడంతో అంకిత్ వారి ఫోన్లను హ్యాక్ చేసి, క్షణాల్లో బాధితుల క్రెడిట్ కార్డులోని డబ్బులతో ఈ-కామర్స్ ద్వారా కొనుగోలు జరిపేవాడు. అంకిత్ చెప్పినట్లు చేసినందుకు ఖలీం, రషీద్ ఇద్దరికీ లక్షకు రూ.2500 చొప్పున గుర్తు తెలియని వ్యక్తుల పేరిట రాపిడో కొరియర్ ద్వారా డబ్బులు పంపేవాడు. అంకిత్ వీరిద్దరితో వాట్సాప్‌ద్వారా మాత్రమే మాట్లాడేవాడు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన సురేష్ అనే వ్యక్తి నిందితుల చేతిలో మోసపోయి, సిరిసిల్లపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా హైదరాబాదులో ఖలీం పాషాను అరెస్టుచేశారు. నిందితుడివద్ద నుంచి కారు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో 60ఫిర్యాదులు వచ్చాయని, అలాగే నిందితులు సుమారు రూ.50 లక్షల మోసాలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మరోఇద్దరి నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది గంగారెడ్డి, కిట్టు, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌లను అభినందించారు.

యువకుడి హత్య కేసు నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్‌లో కొద్దిరోజుల క్రితం జరిగిన సల్లూరి మల్లేష్(26) హత్య కేసులో ముగ్గురు నిందితులు నైనాల రాజిరెడ్డి, నైనాల మల్లారెడ్డి, చింతల హరీష్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. హత్యకేసు వివరాలను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శనివారం వెల్లడించారు. నిందితుడు నైనాల రాజిరెడ్డి కుమార్తెను కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ ప్రేమపేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీంతో నిందితులు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో గతంలో సల్లూరి మల్లేష్‌పై పలు కేసులు పెట్టారు. మృతుడిపై రౌడీషీట్ ఓపెన్ అయిందన్నారు. మృతుడు మల్లేష్‌కూడా రాజిరెడ్డి, మల్లారెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసుపెట్టగా వారు రిమాండ్‌కు వెళ్లి వచ్చారన్నారు. మూడు సంవత్సరాలుగా ఇరువురిమధ్య ఈ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఉదయం మల్లేష్ నైనాల రాజిరెడ్డి ఇంటికి వెళ్లి అతని కుమార్తె ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో బెదిరించి, తనతో రావాలని బలవంతం చేశాడు. ఆమె నిరాకరించగా, ఇంటిపై రాళ్లు విసిరాడు. వెంటనే ఆమె లక్షెట్టిపేటలో ఉన్న తనతండ్రికి ఫోన్ ద్వారా విషయం తెలిపింది. నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌తో కలిసి కిషన్‌రావుపేట వచ్చారు. ముగ్గురు కలిసి మొదటమల్లేష్‌పై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాజిరెడ్డి తన కూతురును, పాత కేసు పత్రాలు తీసుకు వస్తానని చెప్పి వెనుకాల ఆటోలో వెళ్లాడన్నారు. ముందుగా వెళ్లిన మల్లారెడ్డి, హరీష్‌కు వెల్గటూర్ సమీపంలో బ్రిడ్జివద్ద మల్లేష్ ద్విచక్రవాహనంపై కనిపించగా ఆపి కొట్టారు. అనంతరం ఈ విషయం రాజిరెడ్డికి ఫోన్‌ద్వారా వారు తెలపగా రాజిరెడ్డి వెంటనే ఆటోలో అక్కడికి చేరుకుని మృతుడిపై దాడిచేశాడు. గమనించిన కొందరువారిని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో వారు మల్లేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వెళ్తామనిచెప్పి బలవంతంగా రాజిరెడ్డి ఆటోలో ఎక్కించారు. అనంతరం కోటిలింగాల రోడ్డులో ఉన్న పాతవైన్స్ వెనుక ఆటోనుఆపి రాజిరెడ్డి కత్తితో మల్లేష్‌ను పొడిచాడు. మల్లేష్ మృతిచెందినట్లు నిర్ధారించుకొని నిందితులు ముగ్గురు అక్కడినుంచి పారిపోయారన్నారు. నిందితులు హత్యకు ఉపయో గించిన కత్తి, ఆటో, దుస్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐరాంనర్సింహారెడ్డి, ఎస్సైఉమాసాగర్ ఉన్నారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

అదుపుతప్పి లారీ బోల్తా

హుజూరాబాద్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి బూడిద లోడుతో వస్తున్న లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వస్తున్న ఆటోను బూడిద లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. లారీడ్రైవర్ నిద్ర మత్తు కారణం గానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.


బోల్తాపడిన లారీ

బీఈడీ, ఎల్‌ఎల్‌బీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ), మాస్టర్ ఎడ్యుకేషన్ (ఎంఈడీ), ఎల్‌ఎల్‌బి (న్యాయ) కోర్సుల్లో రెండో, నాలుగోసెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి సురేష్‌కుమార్ శనివారం విడుదల చేశారు. పరీక్షలు ఆగస్టు 2025లో జరుగుతాయని తెలిపారు. పరీక్ష రుసుమును ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 29-07-2025 వరకు చెల్లించాలని 300రూపాయల అపరాధ రుసుముతో 01-08-2025వరకు ఆన్‌లోన్‌లో చెల్లించవలసిందిగా తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయాకళాశాలలో సంప్రదించాలని కోరారు. అన్ని పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు 29-07-2025 నుంచి 01–8-2025 వరకు జరుగుతాయని విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

నేడు బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన

వేములవాడ కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో బాలాలయం నిర్మాణానికి ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. దర్శనాల కోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్‌లు, కల్యాణం, అభిషేక సంకల్ప పూజల కోసం షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదివారం ప్రత్యేకం

ఊరిని మార్చిన మల్లన్న స్వామి





ఆదివారం మద్యం, మాంసం బంద్

- ప్రతీ సంవత్సరం హోలీ తర్వాత పెద్దాపూర్‌లో బోనాల జాతర
- వివిధ రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తుల రాక

మెట్‌పల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సెలవుదినమైన ఆదివారం వచ్చిందంటే చాలు మాంసాహార ప్రియులు చికెన్, మటన్, చేపలు ఇలా ఎవరికి ఇష్టం వచ్చింది వాళ్లు ఇంటికి తెచ్చుకుంటూ ఉంటారు. గ్రామాల్లో ఉదయం నుంచే కల్లు తాగే ప్రియులతో ఈత, తాటి వనాల్లో సందడి నెలకొంటుంది. కానీ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మాత్రం ప్రతీ ఆదివారం మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. దీనికి కారణం ఆ గ్రామంలో వెలిసిన మల్లికార్జున స్వామి భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తాడని వారి నమ్మకం. దీంతో పదిహేనేళ్లుగా గ్రామస్థులు ప్రతి ఏటా హోలీ పండగ తరువాత మొదటి ఆదివారం బోనాల జాతర నిర్వహిస్తున్నారు. దీనికి యేటా లక్షకు పైగా భక్తులు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రల నుంచి తరలివస్తున్నారు.

● ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన దేవాలయం...

సుమారు వందేళ్ల క్రితం పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి వెలిశాడని పూర్వీకులు చెబుతారు. తొలిరోజుల్లో యాదవులు మాత్రమే స్వామికి పూజలు చేసేవారు. కొన్నాళ్లకు ఊరి వాళ్లంతా మల్లన్న స్వామిని తమ ఇలవే ల్పుగా కొలవడం ప్రారంభించారు. సంతానం, పెళ్లి, వ్యాపారం, ఇల్లు ఇలా ఏది కోరుకుని స్వా మికి మొక్కుకున్నా నెరవేరుతుందనేది భక్తుల నమ్మకం. భక్తులు తమ కోరికలు తీరినప్పుడల్లా ఇక్కడికి వచ్చి మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రారంభంలో చిన్న పూరి గుడిసెతో ఉన్న ఆలయానికి క్రమంగా స్వామి వారి భక్తుల రాక పెరిగింది. స్వామి వారికి వచ్చే కానుకలు, ఆలయానికి వచ్చే భక్తుల సహకారంతో గ్రామస్థులంతా ఒక్కటై గర్భగుడిని నిర్మించారు. ప్రతీ సంవత్సరం హోలీ పండగ తరువాత మొదటి ఆదివారం బోనాల జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ముందుగా శనివారం స్వామి వారిని గోదావరి నదికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించిన అనంతరం గ్రామానికి తీసుకొచ్చి రాత్రి కల్యాణం వైభవంగా జరుపుతారు. ప్రతీ సంవత్సరం మల్లన్న స్వామిని దర్శించుకొని బోనాలు సమర్పించడానికి మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షకు పైగా భక్తులు తరలి వస్తారు. మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం శివ సత్తులు, పోతురాజుల పూనకాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

● 15 ఏళ్లుగా నిష్ఠతో పూజలు

మల్లన్న స్వామికి ఆదివారం ప్రీతికరమైనదిగా భావించే పెద్దాపూర్ ఊరి గ్రామస్థులు ఆ రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి ఊళ్లో స్వయంభువుగా కొలువుదీరి తమను చల్లగా కాపాడుతున్నాడని గ్రామస్థుల నమ్మకం. దీంతో గ్రామస్థులంతా ఏకమై ఆదివారం నాడు మందు ముట్టకుండా, మాంసం తినకుండా ఉండాలని 15 సంవత్సరాల క్రితం తీర్మానం చేసుకొని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రా మంలో సుమారు 300లకు పైగా కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉంది. మల్లన్నస్వామికి ఇష్టమైన ఆదివారం రోజు భక్తులు నిష్టతో ఉండి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. గ్రామంలో ఆదివారం పిల్లాపాపలతో కలిసి మల్లన్నస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివారం మద్యానికి, మాంసానికి దూరంగా ఉంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులు



పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి దేవాలయం

భక్తుల కొంగు బంగారం

-మిట్టపల్లి నారాయణరెడ్డి, పెద్దాపూర్ గ్రామస్థుడు



మల్లన్న స్వామికి ఆదివారం ప్రీతికరమైనదిగా భావించి మాంసం తినడం, మందు తాగడం పదిహేనేళ్ల నుంచి మానేశాం. ప్రతి ఏటా నిర్వహించే జాతరకు లక్షకు పైగా భక్తులు వచ్చి మల్లన్న స్వామిని దర్శించుకుంటారు. ముఖ్యంగా పెళ్లి కాని వారు, సంతానం లేని వారు ఇక్కడికి వచ్చి స్వామి వారిని మొక్కుకుంటారు. 15 ఏళ్ల నుంచి గ్రామంలో మందు, మాంసం తినకూడదని ఆచారంగా పెట్టుకున్నాం.

మహా సుదర్శన, రాజశ్యామల మహోత్సవాలకు ఏర్పాట్లు

- ఖనిలో మూడు రోజుల పాటు యాగాలు, హోమాలు
- హాజరుకానున్న మంత్రులు, పీఠాధిపతులు, నాగ సాధువులు, స్వామిజీలు

కోల్‌సిటీ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఆధ్యాత్మికశోభ సంతరించుకోనున్నది. లోక కల్యాణార్థం, మానవాళి క్షేమం కోరుతూ రాష్ట్రీయ సాధుసంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు, రాజశ్యామలదేవి ఉపాసకుడు తూడి శ్రావణ్‌కుమారస్వామిజీ ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్ సమీపంలోని సత్యసాయి మందిరంలో మహాసుదర్శన, రాజశ్యామలదేవి త్రయాహ్నిక యజ్ఞమహోత్సవాలు సోమవారం నుంచి జరుగనున్నాయి. ఇందుకోసం సత్యసాయి మందిరం ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. యాగాలు, హోమాలు, ఇతరత్ర క్రతువుల కోసం సిద్ధం చేస్తున్నారు. మూడురోజులపాటు జరిగే మహోత్సవాలలో సోమవారం ఉదయం 6గంటల నుంచి మహాగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, దీక్షాకంకణ ధారణలు, రుద్రహోమం, 22నమంగళవారం మండప పూజలు, మహా సుదర్శన యాగం, మంత్ర పుష్పం, కుంకుమార్చన, 23న రాజశ్యామల దేవియాగం, ప్రత్యంగిరి, వారాహి దేవి హోమాలు, పూర్ణాహుతి, కార్యక్రమాలు జరుగనున్నాయి.

మహోత్సవాలకు మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చింతకుంట విజయరమణారావు, ఎంపీ వంశీకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన నున్నారు. పలువురు పీఠాధిపతులు, స్వాములు, నాగ సాధువులు పాల్గొననున్నారు.



మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో జమ్మికుంటకు 17వ ర్యాంక్

జమ్మికుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపాల్టీ స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలో 17వ ర్యాంక్ సాధించింది. ఇంటిపన్నుల వసూళ్లలో రెండు ఆర్థికసంవత్సరాలు రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. సీడీఎంఏ శ్రీదేవి ఫోన్‌లో మున్సిపల్‌కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, అధికారులు, సిబ్బందిని అభినందించించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 92వ స్థానం, దేశంలో 1216స్థానం, 2024ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 17వస్థానం, దేశంలో 217స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 17వ స్థానంలో జమ్మికుంట మున్సిపాల్టీ నిలిచేందుకు కష్టపడ్డ ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

తహసీల్దార్ కార్యాలయం ఎదుట దంపతుల భిక్షాటన

- అధికారులు పట్టించుకోవడం లేదని నిరసన

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన అక్షయ్-మమత అనే దంపతులు శనివారం భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా రేషన్‌కార్డు కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై స్థానికతహసీల్దార్‌ను వివరణ కోరగా కార్యాలయానికి రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని, దరఖాస్తులు ఏమీ పెండింగ్‌లో లేవని తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తున్న దంపతులు

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చొక్కారావు చిరస్మరణీయుడు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



చొక్కారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో మాజీమంత్రి జువ్వాడి చొక్కారావు చిరస్మరణీయుడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మాజీమంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా కరీంనగర్‌లో ఆయన విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళులర్పించారు. చొక్కారావుతో ఉన్న స్మృతులను గుర్తుకు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలంగాణ రీజనల్ కమిటీ ఛైర్మన్‌గా, ఎంపీగా, మూడు దఫాలు మంత్రిగా, జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా రాజకీయాల్లో చొక్కారావు అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన నేతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి కేసు విచారణలో బయటపడిన హత్యోదంతం

- రెండేళ్ల క్రితం ఘటన
- పోలీసుల దర్యాప్తు

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంక కదిలింది. గంజాయి కేసులో పట్టుబడిన వారిని విచారిస్తుండగా రెండేళ్ల క్రితం జరిగిన హత్య కేసు బయటపడింది. ప్రస్తుతం నిందితులు గంజాయి కేసులో రిమాండ్‌లో ఉండగా మల్యాల పోలీసులు హత్య కేసు దర్యాప్తు చేపట్టారు. మల్యాల సీఐ నీలంరవి, ఎస్సై నరేశ్‌కుమార్ తెలి పిన వివరాల ప్రకారం 2023 మార్చిలో కొండగట్టు టేకు ప్లాంటేషన్ సమీపంలో మెట్‌పల్లికిచెందిన సింగంనడిపి గంగాధర్ (40) అనేవ్యక్తి మృతదేహం కాలిబూడిద అయిన ఘటనలో అప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల మెట్‌పల్లిలో గంజాయితో ముగ్గురు వ్యక్తు లను అక్కడి పోలీసులు పట్టుకొని విచా రణ జరిపారు. విచారణ చేస్తున్న క్రమం లో గంగాధర్‌ను కొండగట్టుకు తీసుకువచ్చి హత్యకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం గంజాయికేసులో ముగ్గురువ్యక్తులు జైలు లో ఉన్నందున త్వరలోనే వారిని విచారిం చనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గంగా ధర్ అనేవ్యక్తి హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు కేసుదర్యాప్తులో తెలుస్తా యని పోలీసులు పేర్కొన్నారు.

హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులై మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన గజ్జెల కాంతంకు శనివారం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద గజ్జెల కాంతంను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి డీసీసీ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకున్న గజ్జెల కాంతం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి చరిత్ర సృష్టించడమే కాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చేస్తున్న కృషిని యావత్ తెలంగాణ ప్రజానీకం అభినందిస్తోందన్నారు. దశాబ్దకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులను రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేస్తోందని తెలిపారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులు నిర్మించి 80 వేల కోట్లు దోచుకున్న వారు త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ మాజీ ఛైర్మన్ ఆకార భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, లింగంపల్లి బాబు, సముద్రాల అజయ్, బాలబద్రి శంకర్, బొబ్బిలి విక్టర్, అస్తపురం రమేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం



సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

కరీంనగర్ లీగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డి శరత్ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వమించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ప్రాసిక్యూటర్లు న్యాయమూర్తుల, న్యాయవాదుల సమన్వయంతో ముందుకెళ్లాలని, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగిఉండాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షలుపడ్డ కేసులసంఖ్య పెరిగిందని, దాన్ని కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశాలకు విధిగా హాజరుకావాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్ల సమస్యలు ఆయన అడిగితెలుసుకున్నారు. అనంతరం జగిత్యాల ఏపీపీరాజేశ్ ఎస్సీఎస్టీ చట్టం గురించి వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మల్లికార్జున్, చీటి రామకృష్ణారావు, మల్యాల ప్రతాప్, ఆరెల్లి రాములు, లక్ష్మీప్రసాద్, జూలూరు శ్రీరాములు, కుమార్‌గౌడ్, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, ఝాన్సీ, మల్లేశం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలేవి?

- గర్భిణికి కాలం చెల్లిన మందులిచ్చిన సిబ్బంది
- ప్రాథమిక విచారణ కూడా జరపని అధికారులు

జమ్మికుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు వాడడం వల్ల ఓ గర్భిణికి రియాక్షన్ అయ్యింది. ఈ సంఘటన వెలుగుచూసి వారం రోజులు గడిచినా వైద్యశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ పరిధిలోని గణేష్‌నగర్‌కు చెందిన కావ్య అనే గర్భిణి గతనెల30న వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. వైద్యుడు పరీక్షలు చేసి మందులు రాసి ఇచ్చాడు. ఫార్మసిస్ట్ విభాగానికివెళ్లిన కావ్య మందులు తీసుకుని ఇంటికి వెళ్లింది. మందులు వాడడం ప్రారంభించిన నాటి నుంచి ముఖంపై దద్దుర్లు రావడం మొదలయ్యాయి. మొదట స్కిన్ ఎలర్జీ అనుకున్నా రోజురోజుకూ పెరుగుతూ వచ్చాయి. ఈ నెల 10న మళ్లీ వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మళ్లీ మందులురాసి ఇవ్వడంతో ఫార్మసీలో తీసుకుని ఇంటికి వెళ్లింది. దద్దుర్లు తగ్గక పోవడంతో హైదరాబాద్‌లో ఉంటున్న తనభర్త హరీష్‌కు చెప్పింది. 13న జమ్మికుంటకు వచ్చిన హరీష్ ఇంటికి వెళ్లి మందులను పరిశీలించాడు. వాటిలో ఎక్స్‌పైరీ ముగిసిన మందులను గుర్తించాడు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యు డిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాలం చెల్లిన మందులు ఎలా వచ్చాయో తమకు అర్థం కావడం లేదని, అయినా వాటితో రియాక్షన్ కాదని వైద్యులు సమాధానం ఇచ్చారు. కాలం చెల్లిన మందులతో ఏం కాదని ఎలా అంటారంటూ వైద్యుల తీరుపై మండిపడ్డారు. స్పందించిన సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. వారంరోజులు గడిచినావైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రాథమికవిచారణ కూడా చేపట్టక పోవడం విమర్శలకు తావిస్తోంది.



కాలం చెల్లిన ట్యాబ్లెట్స్ (ఫైల్)



కాలం చెల్లిన మందులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య-నరేందర్, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికుమార్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, నేదునూరి శ్రీధర్, కొమిరెల్లి పవన్‌కుమార్, అర్చకులు ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి వారి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగామారింది. వేలాదిగావచ్చిన అంజన్నను దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులు అంజన్నతోపాటు బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

● 23న హుండీల లెక్కింపు

ఈనెల23న ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలను లెక్కింపు చేపట్టనున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. నెలరోజులలో భక్తులు మొక్కుల రూపేణ సమర్పించుకున్న కానుకలు,నగదు లెక్కిస్తామని పేర్కొన్నారు.



ఆలయంలో భక్తుల మొక్కులు

జల దోపిడీపై విద్యార్థులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ జలదోపిడి గురించి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్వీ జిల్లా ఇన్చార్జి రాజోజుల శివకుమార్ మాట్లాడుతూ పక్క రాష్ట్రం మన జలాలను దోపిడి ఎలా చేస్తున్నాయో విద్యార్థులకు వివరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు శివ కుమార్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, దేవయ్య, ఉన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

కోల్‌సిటీటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తీసుకువెళ్లారు. శనివారం హైదరాబాద్ కార్యాలయంలో వెంకటయ్యను సన్మానించారు. దళితులు కుల వివక్షను ఎదుర్కొంటున్నారని, వీటిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విన్నవించారు. బాపయ్య, బొంకూరి మధు, శంకరయ్య, డాక్టర్ గూళ్ళ రాజు పాల్గొన్నారు. మోకాలికి ఆపరేషన్‌తో చికిత్స పొందుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణను పరామర్శించారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన అభివృద్ధి తరగతుల అధికారి రంగారెడ్డి తెలిపారు. అర్హులైన డిగ్రీ విద్యార్థులు ఆగస్టు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికఆదాయం రూరల్ రూ.1.50 లక్షలు, అర్బన్‌కు రూ2 లక్షల లోపు ఉండాలని, డిగ్రీ మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. 150 రోజుల పాటు కోచింగ్ ఇస్తారని, నెలకు రూ.వెయ్యి భృతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 08728-2268686 సంప్రదించాలన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా మైనారిటి వెల్ఫేర్ అధికారి తెలిపారు. జూనియర్, డిగ్రీ, ఇంజనీర్, వృత్తి విద్యా కళాశాలల్లో చదువుతున్న మైనారిటీ విద్యార్థులు సెప్టెంబర్ 9లోగా సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కళాశాలలో ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు జిల్లా స్థాయి చెస్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నేషనల్ చెస్ డేను పురస్కరించుకొని జిల్లా చదరంగ సమాఖ్య, నూగురి మహేందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నూగురి నింబయ్య స్మారక చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గడ్డాల శ్రీనివాస్, బాను విజాయనంద్‌లు తెలిపారు. ఉదయం 9 గంటలకు అమర్‌నగర్‌లోని గాయత్రి విద్యానికేతన్ స్కూల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9515342207, 9989198432, 8096659481 నెంబర్‌లలో సంప్రదించాలని వారు కోరారు.

ఈ నెల 24న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 24న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు తెలిపారు. జిల్లాలోని కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ 60, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు 4, ఆఫీస్ బాయి 1, హెచ్ఆర్ మేనేజర్లు 2 అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏతోపాటు ఆపైన చదువుకున్న 18 నుంచి 40 ఏళ్ల వయసు గల వారు అర్హులన్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని రూం నెంబర్ 225లో బయోడెటాతోపాటు జిరాక్సులు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 9391420932, 8985336947, 8121262441 నెంబర్‌లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జీపీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌కు సన్మానం

సుల్తానాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన జొన్నకోటి వెంకటేశ్‌ను మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్ తదితరులు సన్మానించారు. గర్రెపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్‌ను సన్మానించారు.

పెద్దపల్లి ఇన్‌చార్జీ ఏసీపీగా శ్రీనివాస్



పెద్దపల్లి టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఇన్‌చార్జీ ఏసీపీగా శ్రీనివాస్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మంచిర్యాలలో ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టిన ఘటనలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తండ్రి గజ్జి అయిలయ్య అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆయన సెలవులో ఉండగా, ఇన్‌చార్జీగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

ట్రినిటి ప్రైమరీలో రెడ్ కలర్ డే



పెద్దపల్లి కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో రెడ్ కలర్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, ముఖ్య సలహాదారు దాసరి మమతారెడ్డి పాల్గొన్నారు. మనోహర్‌రెడ్డి రెడ్ కలర్ డే విశిష్టతను విద్యార్థులకు తెలిపి, ప్రకృతి ప్రసాదించిన పలు వర్ణాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పిల్లలకు రెడ్ కలర్ డే శుభాకాంక్షలు తెలిపారు.

జేఎన్టీయూలో కౌన్సెలింగ్

రామగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో యేటా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రతి బ్రాంచ్‌లో పది శాతం సీట్లు కేటాయిస్తారు. ఈ సీట్ల భర్తీకి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారుల పిల్లలకు 18 సీట్లు, కార్మికుల పిల్లలకు 18 సీట్లు ఉండగా అధికారులు పిల్లలు 7గురు, కార్మికుల పిల్లలు 21మంది దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌కు 10 మంది హాజరై 9 సీట్లు ఎంచుకున్నారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, హెచ్ఆర్‌డి జీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్జీ-3 ఎస్ఓటూ జీఎం రాంమోహన్, డిజిఎం సుదర్శనం, జాకీర్(హెచ్ఆర్‌డి), అడ్మిషన్స్ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు దృష్టి సారించాలని డీపీఓ వీర బుచ్చయ్య అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయించాలని, బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. ఎంపీడీఓ పూర్ణచందర్‌రావు, ఎంపీఓ హరీష్, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గోరింటాకు సంబరాలు.. బోనాల వేడుకలు



ఫ్యూచర్ గ్లోబల్ పాఠశాలలో, సుల్తానాబాద్ పాఠశాలలో, కాసులపల్లిలో బోనాలతో విద్యార్థినులు, ఖనిలో కృష్ణవేణి పాఠశాల ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలు

సుల్తానాబాద్, జూలై 19: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శనివారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఒకరి చేతికి మరొకరు గోరింటాకు పెట్టుకుని జానపద నృత్యాలు పాటలతో సందడి చేశారు. శ్రీవాణి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక మాట్లాడుతు మన సంస్కృతి సంప్రదాయల గురించి వివరిస్తూ వీటిని భావితరాలకు తెలుపాలన్నారు. ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్, వివేకానంద, ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో అమ్మ వారికి బోనాలు సమర్పించే సాంప్రదాయాన్ని నేటి తరం వారికి చెప్పడమే ఈ ఉత్సవాల నిర్వహణఅన్నారు. ఐపీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. విద్యార్థులు పోతరాజు, అమ్మ వారి వేషధారణలతో అలరించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆషాఢమాసంలో వేడుకలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలతో అలరించారు. ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలోని కృష్ణవేణి పాఠశాలలలో బోనాల వేడుకను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి పూజలు చేశారు. రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో విద్యార్థులు అమ్మవారి, పోతరాజు వేషధారణతోపాటు బతుకమ్మలు, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర విశేషాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జీలు ఎడ్విన్, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మార్కండేయకాలనీలోని నారాయణ పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించారు. శివసత్తుల నృత్యాలతో పోతరాజు వేషధారణలో విద్యార్థులు సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడే విధంగా బోనాలు ఎత్తుకొని నృత్యం చేస్తూ పూజలు చేసి అమ్మవారికి బోనం చెల్లించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.రజిని పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, రమాదేవి, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు బోనాలను ఎత్తుకుని ప్రదర్శించారు.

పాలకుర్తి: ఫ్యూచర్ గ్లోబల్ పాఠశాలలో బోనాల వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శివసత్తుల, పోతరాజుల వేషధారణలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ బుర్ర సత్యం గౌడ్, ప్రిన్సిపాల్ గండు సతీష్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు లావణ్య అన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలతోపాటు సాందీపని ప్లేస్కూల్‌లో బోనాల వేడుకలు నిర్వహించారు. మోడల్ స్కూల్ విద్యార్థులు అమ్మవారి రూపంతో చేసిననృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకర్షించాయి. ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, సాందీపని ప్లేస్కూల్ కరస్పాండెంట్ రామారావులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: విశ్వభారతి పాఠశాలలో బోనాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తలపై బోనాలు పెట్టుకొని ఊరేగింపుగా పాఠశాలకు తరలివచ్చారు. పాఠశాలల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాల ఆవరణలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు జరిగాయి. పాఠశాల కరస్పాం డెంట్ అబ్బుకేశవరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు పట్టు వస్త్రలను ధరించి బోనాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు.

పెద్దపల్లి రూరల్: కాసులపల్లి ట్రినిటి ఉన్నత పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించారు. చిన్నారులు నెత్తిన బోనాలు ఎత్తుకోగా, విద్యార్థులు పోతురాజుల వేషధారణతో ఊరేగింపుగా పాఠశాలలో పూజలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి, పాల్గొన్నారు.

మంథని: స్థానిక కాకతీయ ఉన్నత పాఠశాలలో బోనాలను నిర్వహించారు. రేణుక ఎల్లమ్మగుడి వరకు డప్పు చప్పుళ్ల ఊరేగింపుగా తరలి వెళ్లారు. విద్యార్థుల ఆటా, పాటలతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు కిరణ్‌రెడ్డి, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఉషోదయ హైస్కూల్ ఆధ్వర్యంలో బోనాల వేడుక, బోనంతో చిన్నారి

అస్తవ్యస్తంగా జిల్లా విద్యా శాఖ

(5వ పేజీ తరువాయి)

పని తీరు మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారని తెలిసింది. కొన్ని ముఖ్యమైన ఫైళ్లను మాత్రమే పరిశీలించి, కొన్నింటిని పరిశీలించకపోవడంపై ప్రస్తావించినట్లు సమాచారం. అయినా విద్యా శాఖ తీరు మారడం లేదని, కొన్ని ఫైళ్ల కదలడం లేదని తెలుస్తున్నది. కలెక్టర్ సమావేశం నిర్వహించిన తర్వాత రెండు రోజుల తర్వాత డీఈవో వ్యక్తిగత కారణాల వల్ల సెలవుపై వెళ్లారు. ఆ సమయంలోనే కలెక్టర్ ఆయా పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను, కొరత ఉన్న పాఠశాలలకు దాదాపు 83 మంది ఉపాధ్యాయులను ఒకటి, రెండు రోజుల్లోనే సర్దుబాటు చేసి ఆర్డర్లు ఇచ్చారు. కొన్ని ఫైళ్లను పరిశీలించి ఆ పనులు జరిగేలా చేసినట్లు సమాచారం. సెలవుల నుంచి డీఈవో తిరిగి వచ్చిన తర్వాత నామమాత్రంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. చాలా జిల్లాలో రెగ్యులర్ డీఈవోల కొరత ఉండగా, ఏడీలకు డీఈవోలు అదనపు బాధ్యతలు ఇస్తున్నారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఏడీగా పని చేసిన మాధవికి పెద్దపల్లి డీఈవోగా 2021 సెప్టెంబర్ 16న అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐదు మాసాల క్రితం ప్రభుత్వం శారద అనే అధికారికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి పెద్దపల్లికి బదిలీ చేశారు. అయితే ఆమెకు డీఈవోగా అదనపు బాధ్యతలు ఇవ్వకుండా కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌ను కొనసాగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెగ్యులర్ డీఈవోలు లేని చోట అక్కడే అసి స్టెంట్ డైరెక్టర్లుగా పని చేస్తున్న వారికి డీఈవోగా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నారు. కానీ ఇక్కడ పని చేస్తున్న ఏడీకి డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించక పోవడంలో మతలబు ఏమిటోనని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జిల్లా విద్యా శాఖను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయిల్ ఫామ్ పంట సాగు, ఎరువుల లభ్యత తదితర అంశాలపై సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు నెలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కొరత రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. రైతులు సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువులు కొనుగోలు చేయాలని, ముందుగానే స్టాక్ కొనుగోలు చేసి పెట్టుకుంటే వాటి పోషక విలువలు తగ్గిపోతాయని రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 2500 ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం లక్ష్యమని, ఇప్పటి వరకు 10 శాతం లక్ష్యం కూడా పూర్తి చేయలేదని అన్నారు. రబీ సీజన్‌లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేలా చూడాలని, 10 ఎకరాల పైగా ఉన్న ప్రతి రైతు టార్గెట్ చేయాలన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్యాలు కేటాయించాలన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలతో పాటు, డ్రిప్ ఏర్పాటుకు కూడా రైతుల నుంచి డీడీలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సిద్ధిపేటలో నూతన ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయిందని, నెల రోజులలో ప్రారంభమవుతుందన్నారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌తో పాటు డ్రిప్ ఏర్పాటుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు



కవలలతో తల్లి శారద

సుల్తానాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన ఓ గర్భిణికి సుఖప్రసవం చేశారు గైనకాలజిస్ట్ రమాదేవి. సుభాష్‌నగర్‌కు చెందిన కల్వల శారద నాలుగవ నెలలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అప్పుడు పరీక్షలు చేసి కవలలుగా నిర్ధారణ చేశామని, నెలలు నిండే వరకు మందులు ఇచ్చి జాగ్రత్తలు చెప్పామన్నారు. ఏడవ నెల వచ్చే వరకూ ప్రత్యేక చికిత్స అందించామని డాక్టర్ రమాదేవి తెలిపారు. శుక్రవారం ఆర్ధరాత్రి సమయంలో శారద అధిక బీపీతోపాటు రక్తహీనతతో ఫిట్స్ కూడా వచ్చే ప్రమాదం ఉండడంతో చికిత్స అందించి ఆమెను సాధారణ స్థితికి తెచ్చామని వివరించారు. శనివారం ఉదయం శారదకు నార్మల్ డెలివరీ చేశామని ఇద్దరు మగ శిశువులు జన్మించారన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను కాపాడడంతో పాటు నార్మల్ డెలివరీ చేసి డాక్టర్ రమాదేవికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువుకు మూడు నెలలు చికిత్స అందించి వైద్యులు కాపాడారు. ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌కు చెందిన ఆశాజ్యోతి, మహేష్ దంపతులకు ఏప్రిల్ 22న తక్కువ బరువుతో శిశువు జన్మించగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రానికి తరలించారు. వైద్యులు రాజీవ్, శిరీష, ఆదిష్‌రెడ్డిలు శిశువుకు వెంటిలేటర్ ద్వారా సర్ఫెక్ట్ టెంట్ ఇంజెక్షన్ ద్వారా 15రోజులు వెంటిలేటర్ మీద చికిత్సను అందించారు. అనంతరం మరో 10రోజులు సీపీ ఆఫ్ మిషన్ మీద చికిత్స అందించి ఫ్లూయిడ్ ద్వారా శిశువు బరువును కిలో 800గ్రాములు పెరిగేలా చేశారు. మరో పది రోజులు హైఫ్రోల్ మిషన్ ద్వారా చికిత్సనందించి శిశువును శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. మూడు నెలలు శిశువుకు ఎసెన్సివ్, నర్సింగ్ సిబ్బంది సువర్ణ గ్రేస్, పుష్పలత, దేవకుమారి, అమృత, నవీన్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తూ శిశువును కాపాడారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అభినందించారు.



శిశువును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వైద్యులు

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



సాధించిన పతకాలతో అభినయ్, సౌజ్ఞశ్రీ

జ్యోతినగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాలలో బాల, బాలికలు, పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. 60 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 600 మీటర్ల రన్‌తో పాటు లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన 40 మందిని త్వరలో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ మీట్‌కు ఎంపిక చేస్తామని అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము గట్టయ్య తెలిపారు. సుదేశ్, ప్రణయ్, దుర్గా ప్రసాద్, ఎం.డి.జావెద్, డి.రమేష్, కృష్ణమూర్తి, మౌనిక పాల్గొన్నారు.

అన్నచెల్లెళ్లకు బంగారు పతకాలు

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో జరిగిన అథ్లెటిక్స్‌లో పోటీల్లో ధర్మారం గ్రామానికి చెందిన ఓరెం అభినయ్, ఓరెం సౌజ్ఞశ్రీలు అన్నచెల్లె బంగారు పథకాలు సాధించారు. అభినయ్ అండర్ 16లో 600 మీటర్లలో ప్రథమ, సౌజ్ఞశ్రీ అండర్ 16 బాలికల విభాగంలో 600 మీటర్లలో ప్రథమ, 60 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకుంది. సౌజ్ఞశ్రీ లాంగ్ జంప్ అండర్ 16 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది.

రాజులగుట్ట క్వారీలో డీసీపీ తనిఖీ

జూలపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని వారికి పేలుడు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ హెచ్చరించారు. పెద్దాపూర్ శివారులో గల రాజులగుట్ట పరిధిలోని క్వారీ స్టోన్‌క్రస్సర్, శ్రీవెంకటేశ్వర మెటల్ సప్లయర్ ప్రదేశాలను శనివారం తనిఖీ చేశారు. లైసెన్స్, రికార్డులను పరిశీలించారు.

విత్తనాల ఎంపికలో నాణ్యత పాటించాలి

ఎలిగేడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన వరి వంగడాలను ఎంచుకొని అధిక దిగుబడులు సాధించాలని కూనారం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సతీష్ చంద్ర తెలిపారు. శనివారం రైతులకు నాణ్యమైన విత్తన కార్యక్రమాన్ని సుల్తాన్‌పూర్, నర్సాపూర్ గ్రామాల్లో చేపట్టారు. ఏఈఓ గణేష్, రైతులు తిరుమలేష్, రవీందర్ రావు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

మంథనిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కన్నాల ప్రభుత్వ ఉన్నత, కన్నాల, నాగారం ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాధికారి మాధవి శనివారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల సామర్థ్యాల పై సూచనలు అందించారు. విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కానుగంటి శ్రీనివాస్ పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితుడు కాగా హెచ్ఎం, ఉపాధ్యాయులు డీఈవో చేతుల మీదుగా సన్మానించారు. ఎంఈవో లక్ష్మి, హెచ్ఎం హరిప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లి టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, వంగిన స్తంభాలు ఉంటే సెక్షన్ ఆఫీసర్, లైన్‌మెన్‌కు తెలియజేయాలని కోరారు. దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని, తద్వారా ప్రమాదాలను నివారిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. భారీ వర్షాలు, గాలి దుమారాల వలన విద్యుత్ తీగలు తెగి పడితే వెంటనే తెలియజేయాలని కోరారు. ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైర్ అతుకులు లేకుండా, ఇనుప రేకుల గుండ వెళ్లకుండ చూడాలని చెప్పారు. వినియోగదారుల గృహాలలో నాణ్యమైన వైరింగ్ వాడాలని, రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు ఎర్తింగ్ పాటించాలని కోరారు. విద్యుత్ సమస్య తలెత్తిన టోల్ ఫ్రీ నెంబర్ 1912లో సంప్రదించాలని కోరారు.

టీబీజీకేఎస్ నాయకుల బదిలీలను రద్దు చేయాలి



అఫీషియేటింగ్ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ నాయకుల బదిలీలను సింగరేణి యాజమాన్యం ఉపసంహరించుకోవాలని శనివారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ టీబీజీకేఎస్ నాయకులతో కలసి ఆర్జీ-2 అఫీషియేటింగ్ జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. చందర్ మాట్లాడుతూ టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ నాయకుడు బాలసాని కొంరయ్యలను రాజకీయ కారణాలతో బదిలీ చేసినట్టు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా 8, 13 నెలల సర్వీస్ ఉన్న ఇద్దరిని బదిలీ చేయడం వెనక రాజకీయ ఒత్తిడి ఉన్నట్టు భావిస్తున్నామన్నారు. ఇటువంటి అనైతిక చర్యలతో బదిలీ చేయించిన వారు కార్మిక వర్గం మన్ననలు కోల్పోతారని అన్నారు. అయిలి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, అనిల్‌రెడ్డి, ఉన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, ఆర్జీ-1 ఏరియాలో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహిద్‌పాషా, బీఆర్ఎస్ నాయకుడు బాలసాని కొమురయ్య గౌడ్‌లను అక్రమంగా బదిలీ చేయడం సమంజసం కాదని, బదిలీలను నిలుపుదల చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎలాంటి చార్జిషీట్లు, ఆరోపణలు లేవని, రాజకీయ ప్రోద్బలంతోనే ఈ బదిలీలు జరిగాయన్నారు. నూనె కొమురయ్య, పార్లపల్లి రవి, శంకర్, మేడిపల్లి సంపత్, సతీష్, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పాలకుర్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, నానో యూరియాను వాడి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు డీలర్ లైసెన్సు రద్దు చేస్తామన్నారు.



11ఇంక్లైన్‌ను తనిఖీ చేసిన జీఎం

గోదావరిఖని, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌ను శనివారం ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. మ్యాప్‌లు, వివిధ సీమ్‌ల ప్యానెల్, ప్లాన్‌లను పరిశీలించారు. గనిలోని 3వ సీమ్ ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో పని స్థలాలను పరిశీలించారు. అధికారుల, సూపర్ వైజర్ల సలహాలను పాటిస్తూ రక్షణతో పని చేయాలని సూచించారు. ఏజెంట్ చిలక శ్రీనివాస్, మేనేజర్‌మల్లేశం పాల్గొన్నారు.

డివైపిఎంకు ఆత్మీయ సత్కారం

రామగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో డివైపిఎంకు పనిచేసి జైపూర్ పవర్ ప్లాంట్‌లోని విజిలెన్స్ విభాగంలో డివైపిఎంగా బదిలీ పై వెళ్తున్న గుర్రం శ్రీహరికి శనివారం ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, నాయకులు సన్మానించారు.

25న మందకృష్ణ మాదిగ రాక

పెద్దపల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, ఆసరా పెన్షన్ దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈనెల 25న పెద్దపల్లిలో చేపడుతున్న మహాసభకు మందకృష్ణ మాదిగా హాజరు కానున్నారని పింఛన్‌దారుల జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం కొత్తపల్లిలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈనెల 25న జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏకు శంకర్, పెర్క సాగర్, జోగు రాజయ్య, పల్లె విజయ్‌కుమార్, సదానందం, పాల్గొన్నారు.